పేదల వైద్యానికి భరోసా

- అందుబాటులో యూపీహెచ్‌సీలు
- ఉచితంగా కార్పొరేట్ తరహా వైద్య సేవలు


బాలాజీనగర్ యూపీహెచ్‌సీలో రోగిని పరిశీలిస్తున్న వైద్యుడు


వివేకానందనగర్‌లో యూపీహెచ్‌సీ

అరిలోవ: గతంలో ఎన్నడూ లేని విధంగా పేదల వైద్యానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోంది. పైసా ఖర్చు లేకుండా కార్పొరేట్ తరహా వైద్యాన్ని అందిస్తోంది. ఇందులో భాగంగా వైఎస్సార్ అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ల(యూపీహెచ్‌సీ)ను ఏర్పాటు చేసింది. విశాఖ తూర్పు నియోజకవర్గంలో ఆరు చోట్ల యూపీహెచ్‌సీల ఏర్పాటుకు గతేడాది ప్రణాళిక సిద్ధం చేశారు. ఒక్కో యూపీహెచ్‌సీ నిర్మాణం కోసం సుమారు రూ.కోటి నిధులు కేటాయించారు. వాటిలో నాలుగు చోట్ల ప్రస్తుతం సేవలు అందుతున్నాయి. మరో చోట సేవలు అందించడానికి సిద్ధంగా ఉంది. ఇంకో యూపీహెచ్‌సీ నిర్మాణ దశలో ఉంది. ప్రస్తుతం సేవలు అందిస్తున్న యూపీహెచ్‌సీలలో అవసరమైన మందులు, వైద్య సిబ్బంది, ల్యాబ్‌లు, 10 పడకలు, సమావేశ గది, మహిళలు, పురుషులకు ప్రత్యేకంగా మరుగుదొడ్లు అందుబాటులో ఉన్నాయి. ఇవి రోజూ ప్రజలకు వైద్య సేవలు అందిస్తున్నాయి. నివాసాలకు దగ్గరలో ప్రభుత్వ ఆస్పత్రులు అందుబాటులో ఉండడంతో దూర ప్రాంతాలకు వ్యయ ప్రయాసలతో వెళ్లాల్సిన అవసరం తప్పిందని, మంచి వైద్యం అందుతుందని ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

రక్త పరీక్షల వివరాలు..

- టీఎస్‌సీ(తెల్ల రక్త కణాల లెక్కింపు)
- డీఎస్‌సీ(ఐదు రకాల రక్త కణాలకు సంబంధించిన పరీక్ష)
- ప్లేట్‌లెట్స్ కౌంట్
- ఎస్.బిలిరూబిన్(కామెర్లు)
- ఆర్‌పీఆర్
- డెంగ్యూ ర్యాపిడ్ టెస్ట్
- స్టూల్ ఫర్ ఓవా అండ్‌సిస్ట్(విరేచనాలకు సంబంధించి)
- టీబీ అండ్ డాట్స్(క్షయకు సంబంధించి పరీక్షలు)

యూపీహెచ్‌సీల వివరాలివి..

తూర్పు నియోజకవర్గం జీవీఎంసీ జోన్–2, 3 పరిధిలో ఉంది. జోన్–2 పరిధిలో 4 యూపీహెచ్‌సీలు ఉండగా.. జోన్–3 పరిధిలో 2 యూపీహెచ్‌సీలు ఉన్నాయి. జోన్–2 పరిధి 10వ వార్డు ఆదర్శనగర్ ప్రాంతం వివేకానందనగర్, 11వ వార్డు బాలాజీ నగర్, 13వ వార్డు అరిలోవ కాలనీ, శ్రీకృష్ణాపురంలలో సుమారు నాలుగు నెలలుగా సేవలు అందిస్తున్నాయి. జోన్–3 పరిధి 16వ వార్డు ఇసుకతోటలో యూపీహెచ్‌సీ నిర్మాణం పూర్తయి ప్రారంభానికి సిద్ధమైంది. 20వ వార్డు చినవాల్తేరులో యూపీహెచ్‌సీ నిర్మాణ దశలో ఉంది.

పూర్తి స్థాయిలో సిబ్బంది, సౌకర్యాలు

- ప్రతి యూపీహెచ్‌సీలో ఏడుగురు వైద్య సిబ్బంది ఉన్నారు. ఒక వైద్యాధికారి, ఇద్దరు స్టాఫ్ నర్సులు, ఒక ల్యాబ్ అసిస్టెంట్, ఒక ఫార్మాసిస్టు, ఒక డేటా ఎంట్రీ ఆపరేటర్, ఒక అటెండర్ ఉన్నారు. వీరితో పాటు వారానికి ఒక స్పెషలిస్టు వైద్యుడు ప్రభుత్వ ఆస్పత్రుల నుంచి వచ్చి సేవలందిస్తున్నారు. గైనిక్, ఆర్థోపెడిక్, జనరల్ సర్జన్, జనరల్ మెడిసిన్, ఈఎన్‌టీ, డెర్మటాలజీ రోజుకు ఒకరు చొప్పున యూపీహెచ్‌సీలలో అందుబాటులో ఉంటున్నారు.
- ప్రతి యూపీహెచ్‌సీలో 10 పడకలు చొప్పున అందుబాటులో ఉంచారు. విశాలమైన గదులున్నాయి. వైద్యులు రోగులను పరిశీలించే కన్సల్టెన్సీ గదులు, సమావేశం నిర్వహించే గది, ల్యాబ్, మందులు స్టోర్ రూం, ఫార్మాసిస్టు హాల్, మరుగుదొడ్లు తదితర సౌకర్యాలున్నాయి.
- 10, 11, 13 వార్డుల్లో ఉన్న నాలుగు యూపీహెచ్‌సీలు గతేడాది అక్టోబరు 2 నుంచి సేవలు అందిస్తున్నాయి. ప్రతి యూపీహెచ్‌సీలో రోజుకు 30 నుంచి 40 వరకు ఓపీ నమోదవుతుంది. 15 నుంచి 20 మంది వరకు రక్త పరీక్షలు చేస్తున్నారు.

రోగులకు మెరుగైన సేవలు

యూపీహెచ్‌సీలలో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయి. వారిలో వైద్యంపై నమ్మకం కలగడంతో రోజు రోజుకు ఓపీ పెరుగుతోంది. ఇక్కడ రోగులకు అవసరమైన మందులు అందుబాటులో ఉన్నాయి. అవసరాన్ని బట్టి రోగులకు రక్త పరీక్షలు చేస్తున్నాం. ప్రత్యేకంగా ల్యాబ్ అసిస్టెంట్, ఫార్మాసిస్ట్ నిత్యం అందుబాటులో ఉంటారు.

– డాక్టర్ సంతోష్, యూపీహెచ్‌సీ వైద్యాధికారి, బాలాజీనగర్, అరిలోవ


వివేకానందనగర్ యూపీహెచ్‌సీలో పడకలు


యూపీహెచ్‌సీలో ల్యాబ్

క్లుప్తంగా

విద్యార్థులకు క్రీడా పరికరాల పంపిణీ


విద్యార్థులకు క్రీడా పరికరాలు అందిస్తున్న ఏరియా 9 లేడీస్ సర్కిల్ ఇండియా ప్రతినిధి

అరిలోవ: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని తోటగరువు హైస్కూల్‌లో విద్యార్థులకు ఏరియా 9 లేడీస్ సర్కిల్ ఇండియా సంస్థ ఆధ్వర్యంలో సోమవారం క్రీడా పరికరాలు పంపిణీ చేశారు. వాలీబాల్, స్కిప్పింగ్ రోప్స్, ఫుట్‌బాల్, బాస్కెట్ బాల్, షటిల్, టెన్నీకాయిట్ తదితర క్రీడా పరికరాలను హెచ్‌ఎం జి.కె.డి.భవాని సమక్షంలో విద్యార్థులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ చైర్‌పర్సన్ శ్వేత జోషి, ప్రతినిధులు శుభ, హైమా, ఆస్తా బజాజ్, నిషాకుప్పు, భావన, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు పైడిమాంబ జాతర


పైడిమాంబ ఆలయం వద్ద ఏర్పాట్లు చేస్తున్న దృశ్యం

అరిలోవ: పద్నాలుగు గ్రామాల ఇలవేల్పు పైడిమాంబ అమ్మవారి జాతర మంగళవారం జరగనుంది. జాతీయ రహదారిని ఆనుకుని డెయిరీ ఫారం వద్ద కొలువుదీరిన అమ్మవారి ఆలయం వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. గత నెల 27న అమ్మవారి జాతర మహోత్సవాలు ప్రారంభమైన విషయం తెలిసిందే. చాటింపు నుంచి రోజు నుంచి భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేస్తున్నారు. ఆలయం ప్రాంగణంలో నిత్యం భజనలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. మంగళవారం ప్రధాన జాతర సందర్భంగా ఆలయ నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆలయం నుంచి పాత డెయిరీ ఫారం మీదుగా ఆదర్శనగర్ వరకు విద్యుత్ దీపాలంకరణ చేశారు. అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం కర్రలతో క్యూలు ఏర్పాటు చేశారు. దాదాపు 70 మంది అరిలోవ పోలీసులు బందోబస్తు కూడా నిర్వహించనున్నారు. పలు స్వచ్ఛంద సంస్థలు భక్తులకు ప్రసాదం, మజ్జిగ పంపిణీ చేయడానికి రోడ్డుకు ఇరువైపులా స్టాళ్లు ఏర్పాటు చేశాయి.

ఫ్యాషన్ వీక్ పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్ ఆవిష్కరిస్తున్న మేయర్ గొలగాని

అరిలోవ: మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని నగరంలో గ్లామ్ ఫ్యాషన్ వీక్ పేరుతో ఈవెంట్స్ అండ్ ఆర్గనైజర్స్ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ మేరకు పోస్టర్‌ను పెదగదిలిలోని మేయర్ క్యాంప్ కార్యాలయంలో సోమవారం మేయర్ గొలగాని హరి వెంకటకుమారి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఫ్యాషన్ డిజైనింగ్‌లో ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటు చేసి మహిళలను గౌరవించడం అభినందనీయమన్నారు. నిర్వాహకులు ఉమా, సంతోష్ రాజ్ పాల్గొన్నారు.

నేడు కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన

దాబాగార్డెన్స్: విశాఖ వాసుల ఆరాధ్యదైవం కనకమహాలక్ష్మి అమ్మవారికి 108 స్వర్ణ పుష్పాల తో మంగళవారం అష్టదళ పద్మారాధన నిర్వ హించనున్నారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించనున్న ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలచే భక్తులు రూ.1,116 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలి. వివరాలకు 0891–2711725, 2566514 నంబర్లకు ఫోన్ చేయవచ్చు.

సీతంరాజుకు మద్దతుగా విస్తృత ప్రచారం


జీవీఎంసీ 11వ వార్డులో ప్రచారం చేస్తున్న మేయర్ గొలగాని, పార్టీ సమన్వయకర్త అక్కరమాని విజయనిర్మల

అరిలోవ: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌కు మద్దతుగా వైఎస్సార్‌సీపీ నాయకులు సోమవారం విస్తృత ప్రచారం చేశారు. 11వ వార్డులో నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గం సమన్వయకర్త అక్కరమాని విజయ నిర్మల స్థానిక నాయకులతో కలసి ప్రచారం చేపట్టారు. పార్వతీనగర్, దుర్గానగర్‌లో పట్టభద్రుల ఇళ్లకు వెళ్లి కరపత్రాలు అందజేశారు. సుధాకర్‌కు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి ఎమ్మెల్సీగా గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు గొలగాని శ్రీనివాస్, కె.మోహనరావు, తదితరులు పాల్గొన్నారు.

- జీవీఎంసీ 13వ వార్డు పాండురంగాపురం, విష్ణుపురి కాలనీలో వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రచారం చేశారు. పట్టభద్రుల ఇళ్లకు వెళ్లి సీతంరాజు సుధాకర్‌కు ఓటేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు కెల్ల సత్యనారాయణ, పిల్లి వీర్రాజు, ఆనంద్, భాగ్యరాజ్, ఫర్వీన్, తదితరులు పాల్గొన్నారు.

హైస్కూల్‌లో పట్టభద్రుల ఓటర్ల స్లిప్‌ల పంపిణీ


తోటగరువు హైస్కూల్‌లో ఓటర్ల స్లిప్‌లు అందిస్తున్న చినగదిలి మండలం వీఆర్‌వోలు

అరిలోవ: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్‌కు అధికారులు సన్నద్ధమవుతున్నారు. అరిలోవ ప్రాంతంలో పట్టభద్రులు ఓటేయడానికి తోటగరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేస్తున్నారు. దీని పరిధిలో ఉన్న ఓటర్లకు రూరల్ మండలం(చినగదిలి) రెవెన్యూ అధికారులు రెండు రోజులుగా ఓటర్ల స్లిప్‌లు పంపిణీ చేస్తున్నారు. ఇందు కోసం తోటగరువు హైస్కూల్‌లో ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేశారు. దీని పరిధిలో 5,950 మంది పట్టభద్రుల ఓటర్లు ఉన్నారు. వీరి కోసం ఇక్కడ ఆరు పోలింగ్ స్టేషన్లు కేటాయించారు. 281, 282, 283, 283ఏ, 284, 284ఏ నంబర్లతో ఈ పోలింగ్ స్టేషన్లు ఓటర్లకు అందుబాటులో ఉంటాయి. ఓటర్లకు పోలింగ్ స్టేషన్ నంబరు, సీరియల్ నంబరు, పేరు తదితర వివరాలతో కూడిన స్లిప్‌లను వీఆర్వోలు అందజేస్తున్నారు. మరో రెండు, మూడు రోజుల పాటు వీటిని పంపిణీ చేయనున్నట్లు వీఆర్‌వో సత్యం దొర తెలిపారు. ఓటర్లు తమకు సంబంధించిన స్లిప్‌లు తీసుకోవచ్చని ఆయన తెలిపారు.

మాధవ్‌ను మరోసారి గెలిపించాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ జీవీఎల్

ఎంవీపీ కాలనీ: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీగా పీవీఎన్ మాధవ్‌ను మరోసారి గెలిపించాలని బీజేపీ ఎంపీ జీవీఎల్ నరసింహారావు కోరారు. లాసన్స్ బే కాలనీలోని పార్టీ కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. తొలి ప్రాధాన్యత ఓటు వేసి మాధవ్‌ను గెలిపించడం ద్వారా విశాఖలో బీజేపీ అభివృద్ధిని మరింత ప్రోత్సహించాలన్నారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో కేంద్రంలో బీజేపీ మరోసారి అధికారంలోకి రానుందన్నారు. ఇటీవల వెలువడిన ఈశాన్య రాష్ట్రాల ఎన్నికల ఫలితాలే ఇందుకు నిదర్శనమన్నారు. ఈ కార్యక్రమంలోమ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు విష్ణుకుమార్ రాజు, విశాఖ పార్లమెంట్ జిల్లా అధ్యక్షుడు మేడపాటి రవీంద్ర, తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌డీవై, ఎస్‌బీసీ వెలమ సంఘం నూతన కార్యవర్గం

దాబాగార్డెన్స్: నేవల్ డాక్‌యార్డ్, ఎస్‌బీసీ ఉద్యోగుల వెలమ సంక్షేమ సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక సోమవారం జరిగింది. ఈ సందర్భంగా నూతన బేరర్ సభ్యులను ఉద్యోగులు ఎన్నుకున్నారు. సంఘం గౌరవ అధ్యక్షుడిగా ఎస్‌వీ రమణ, అధ్యక్షుడిగా ఆర్‌పీ నాయుడు, కార్యదర్శిగా వై.రామునాయుడు, కోశాధికారిగా ఎల్.దేముడుబాబు, ఉపాధ్యక్షులుగా ఆర్.శంకరరావు, ఆర్.వెంకట్రావు, సహాయ కార్యదర్శులుగా కె.శ్రీనివాసరావు, అల్లు కిరణ్‌కుమార్, సీహెచ్.జనార్దనరావు, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా జి.వెంకటరమణ, రెడ్డి శ్రీనివాస్, ఆర్.లోవరాజు, అసిస్టెంట్ సెక్రటరీలుగా పి.రామునాయుడు, బి.వరహాలుబాబు, సబ్బవరపు సతీష్, ఎం.రామారావు ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే తైనాల విజయ్‌కుమార్, వైఎస్సార్ సీపీ నాయకుడు చొక్కాకుల వెంకట్రావు, కార్పొరేటర్లు అల్లు శంకరరావు, బొడ్డు నరసింహపాత్రుడు, ముర్రు వాణి, తదితరులు పాల్గొన్నారు.

గ్రూపు-2పై 9న అవగాహన సదస్సు


పోస్టర్ ఆవిష్కరిస్తున్న శిక్షణ కేంద్రం ప్రతినిధులు

మద్దిలపాలెం: ఏపీపీఎస్సీ గ్రూప్–2 అభ్యర్థులకు ఈ నెల 9న ఉచిత అవగాహన సదస్సు నిర్వహించనున్నామని అల్లూరి స్టడీ సర్కిల్ డైరెక్టర్ అభిమన్యు, డీవైఎఫ్‌ఐ అధ్యక్షుడు యు.ఎస్.ఎన్.రాజు తెలిపారు. ఈ మేరకు సదస్సు పోస్టర్‌ను సోమవారం మద్దిలపాలెంలో ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ డాబాగార్డెన్స్‌లోని అల్లూరి విజ్ఞాన కేంద్రంలో గ్రూప్–2 పరీక్ష విధానంపై మధ్యాహ్నం 2.30 గంటలకు సదస్సు జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్‌ఐ కార్యదర్శి కె.సంతోష్, ఐ.రఘు పాల్గొన్నారు.

ఘనంగా షిర్డీ సాయి అఖండ నామ కీర్తన


సాయి కీర్తనలు ఆలపిస్తున్న భక్తులు

మద్దిలపాలెం: శివాజీపాలెంలోని షిర్డీసాయి మందిరంలో సోమవారం అఖండ నామ కీర్తన ఘనంగా నిర్వహించారు. ఉదయం 6 నుంచి రాత్రి 7 గంటల వరకు ద్వారకామయి బృందం సాయి కీర్తనలు ఆలపించారు. ఈ బృందం ప్రతి నెలా 6న బాబా గుడిలో అఖండ సాయి నామ కీర్తనలు ఆలపించడం ఆనవాయితీ. ఇందులో భాగంగా ఈ వారం శివాజీపాలెంలో 124వ గుడిలో శ్రీకృష్ణ సేవా సంఘం ఆధ్వర్యంలో సంకీర్తనలు ఆలపించారు.

‘లీగల్ కౌన్సిల్ సేవలు సద్వినియోగం’


జైల్‌లో ఖైదీలకు అవగాహన కల్పిస్తున్న న్యాయ సేవాధికారి సంస్థ కార్యదర్శి బులికృష్ణ

అరిలోవ: జైల్‌లో జాతీయ న్యాయ సేవాధికార సంస్థ ఏర్పాటు చేసిన లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సేవలను ఖైదీలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ కార్యదర్శి కె.కె.వి.బులికృష్ణ సూచించారు. విశాఖ కేంద్ర కారాగారాన్ని ఆయన సోమవారం సందర్శించారు. ఇక్కడ మహిళా ఖైదీలు ఉండే బేరక్‌లను పరిశీలించారు. వారికి అందుతున్న ఆహారం, వసతి, తాగునీరు, వైద్యం తదితర మౌలిక సదుపాయాలపై ఆరా తీశారు. అనంతరం మహిళా ఖైదీలకు న్యాయపరమైన విషయాలపై అవగాహన కల్పించారు. వారికి ఉన్న సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. న్యాయ సంబంధమైన సమస్యలను సంస్థ ద్వారా పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. మహిళా లీగల్ వలంటీర్లు రాశి, దివ్య, సుజాత, జైల్ అధికారులు పాల్గొన్నారు.

సమాచారమ్

విద్యార్థుల్లో స్నేహభావం అవసరం


మాట్లాడుతున్న ఆచార్య జి.యోహాన్‌బాబు

ఏయూ క్యాంపస్: విద్యార్థులు స్నేహభావంతో కలసికట్టుగా పనిచేస్తే మెరుగైన ఫలితాలు సాధించగలరని ఏయూ తెలుగు విభాగం విశ్రాంత ఆచార్యుడు జి.యోహాన్‌బాబు అన్నారు. సోమవారం ఉదయం ఏయూ తెలుగు విభాగంలో నిర్వహించిన విద్యార్థుల స్వాగత వేడుకల్లో ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడారు. విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందించే కార్యక్రమాలు భవిష్యత్తుకు బాటలు వేస్తాయన్నారు. తెలుగు సాహిత్యాన్ని అధ్యయనం చేస్తే ఎన్నో ఉపాధి అవకాశాలు ఉన్నాయని, సినిమా, పత్రికలు, పర్యాటక రంగాలలో అవకాశాలు ఎదురుచూస్తున్నాయని చెప్పారు. విద్యార్థులు మార్కుల కోసం కాకుండా మనస్సు పెట్టి అవగాహనతో చదువుకుంటే ఉన్నత శిఖరాలు అధిరోహించగలరన్నారు. తెలుగు శాఖాధిపతి ఆచార్య జర్ర అప్పారావు మాట్లాడుతూ తెలుగు సంస్కృతి సంప్రదాయాలను ప్రతిబింబించే విధంగా విభాగాన్ని తీర్చిదిద్దడం ఆనందంగా ఉందన్నారు. జూనియర్లను ఎంతో ఆప్యాయతతో రెండో సంవత్సరం విద్యార్థులు ఆహ్వానించడం చాలా బాగుందన్నారు. ఆహ్వాన వేడుకలలో భాగంగా జరిగిన ఆటల పోటీలలో విజేతలైన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. ఈ కార్యక్రమంలో ఆచార్యులు డాక్టర్ అయ్యగారి సీతారత్నం, డాక్టర్ అన్నంశెట్టి ఈశ్వరమ్మ, డాక్టర్ బూసి వెంకటస్వామి, డాక్టర్ కట్టిపోగు రత్నశేఖర్, డాక్టర్ పెండ్యాల లావణ్య, ఆతుకూరి వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

మేధోశక్తిని మెరుగుపరుచుకోవడం తప్పనిసరి



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ కె.శ్రీనివాసరావు

ఏయూ క్యాంపస్: విద్యార్థులు తమ మేధోశక్తిని నిరంతరం మెరుగుపరుచుకోవడం తప్పనిసరని ఏయూ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య కె.శ్రీనివాసరావు అన్నారు. సోమవారం ఉదయం ఏయూ టీఎల్‌ఎన్ సభా మందిరంలో ఉన్నత విద్యా మండలి నిర్వహించిన జోనల్ స్థాయి క్విజ్ పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జ్ఞాపకశక్తికి పరీక్షగా క్విజ్ పోటీలు నిలుస్తాయన్నారు. విశ్లేషణాత్మక ఆలోచనలకు ఈ పోటీలు దోహదపడతాయని చెప్పారు. విద్యార్థులు తమ జ్ఞానాన్ని పెంచుకుంటూ, కాలాన్ని సమర్థవంతంగా నిర్వహిస్తూ పోటీ పడాలన్నారు. కార్యక్రమ అధ్యక్షుడు ఆచార్య ఎ.నాగహనుమాన్ మాట్లాడుతూ 40 గ్రూపులుగా 80 మంది విద్యార్థులు పోటీలలో పాల్గొంటున్నారన్నారు. విద్యార్థులకు వర్సిటీ ప్రాంగణంలో వసతి, భోజన సదుపాయాలు కల్పించామన్నారు. ఉన్నత విద్యా మండలి అధికారి ఎ.ఆర్.నగేష్ మాట్లాడుతూ మూడు రీజియన్‌లుగా పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. వీటిలో విజేతలకు రాష్ట్రస్థాయి పోటీలకు అవకాశం కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నోడల్ ఆఫీసర్ శ్రీధర్, ఎన్‌ఎస్‌ఎస్ సమన్వయకర్త ఆచార్య ఎస్.హరనాథ్, తదితరులు పాల్గొన్నారు.

మూల్యాంకన కేంద్రం పరిశీలన


మూల్యాంకన కేంద్రం పరిశీలిస్తున్న రెక్టార్ సమత

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం ప్రశ్నాపత్రాల మూల్యాంకన కేంద్రాన్ని ఏయూ రెక్టార్ ఆచార్య కె.సమత సోమవారం ఉదయం సందర్శించారు. బీఈడీ మూడో సెమిస్టర్ ప్రశ్నపత్రాల మూల్యాంకనం జరుగుతున్న విధానాన్ని ఆమె ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ కార్యక్రమంలో విద్యా విభాగాధిపతి ఆచార్య టి.షారోన్‌రాజు, అధికారులు పాల్గొన్నారు.

సమన్వయంతో పథకాల అమలు


శిక్షణకు హాజరైన అధికారులతో ఐఐఎం సంచాలకుడు ఆచార్య చంద్రశేఖర్

ఏయూ క్యాంపస్: ప్రభుత్వ పథకాల అమలులో సమన్వయం ఎంతో అవసరమని కేంద్ర ప్రభుత్వ ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ పూర్వ కార్యదర్శి అజయ్ ప్రకాష్ షానోయ్ అన్నారు. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ విశాఖపట్నంలో డిజిటల్ గవర్నెన్స్–మేనేజ్‌మెంట్ అంశంపై ఆల్ ఇండియా సర్వీసెస్ అధికారులకు ఐదు రోజుల స్వల్పకాలిక శిక్షణ తరగతులు సోమవారం ప్రారంభమయ్యాయి. ఈ శిక్షణను కేంద్ర ప్రభుత్వ ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ పూర్వ కార్యదర్శి అజయ్ ప్రకాష్ షానోయ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం సాధారణ పౌరుడికి విభిన్న సేవలను సాంకేతిక విధానాలు ఏ విధంగా చేరువ చేస్తున్నాయో వివరించారు. ప్రపంచానికి అవసరమైన ఆర్థిక వ్యవస్థను నిర్మించే సామర్థ్యం భారత్‌కు ఉందని స్పష్టమైందన్నారు. పారదర్శకతను పెంపొందించడానికి డిజిటల్ మౌలిక వసతులు ఉపయుక్తంగా నిలుస్తున్న విధానాన్ని తెలియజేశారు. ఐఐఎం విశాఖపట్నం సంచాలకుడు ఆచార్య ఎం.చంద్రశేఖర్ మాట్లాడుతూ కొన్నేళ్లుగా ప్రభుత్వ, ప్రైవేటు రంగాల నిపుణులు ఐఐఎంవీ అందిస్తున్న శిక్షణ కార్యక్రమాలను వివరించారు. కార్యక్రమంలో ఆచార్య నీన పాండే, ఆచార్య శ్రీనివాస్ జోస్యుల తదితరులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి


బాలికల గృహంలో మాట్లాడుతున్న రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ అప్పారావు

అరిలోవ: మాదక ద్రవ్యాలకు విద్యార్థులు దూరంగా ఉండాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు కోరారు. రూరల్ తహసీల్దారు కార్యాలయం సమీప ప్రభుత్వ బాలికల గృహాన్ని సోమవారం కమిషన్ సభ్యుడు గొండు సీతారాం, జిల్లా బాలల సంక్షేమ సమితి సభ్యులతో కలసి ఆయన సందర్శించారు. గృహంలో బాలికలకు కల్పిస్తున్న సౌకర్యాలతో పరిసరాలను పరిశీలించారు. అనంతరం అక్కడ బాలికలతో అప్పారావు మాట్లాడారు. పదో తరగతి చదువుతున్న బాలికల పట్ల సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ చూపాలని గృహం సూపరింటెండెంట్ సునీతకు సూచించారు. వారికి క్రమం తప్పకుండా పౌష్టికాహారం అందించాలన్నారు. విద్యార్థులు చెడు స్నేహాలు చేయకూడదన్నారు. క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత స్థాయికి చేరాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా బాలల సంక్షేమ సమితి చైర్మన్ ఎం.ఆర్.ఎల్.రాధ, సభ్యుడు సూర్యనారాయణ, గృహం సిబ్బంది పాల్గొన్నారు.

కుటుంబ సభ్యుల చెంతకు రాయగడ వాసి

ఎంవీపీ కాలనీ: మానసిక సమస్యలు కారణంగా కుటుంబానికి దూరమైన ప్రియక నారిందు అనే వ్యక్తిని రెడ్‌క్రాస్ ప్రతినిధి మురళీ, తదితరులు ఆయన కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఒడిశాలోని రాయగడకు చెందిన ప్రియక నారిందు మానసిక సమస్యలతో బాధపడుతున్నాడు. మతిస్థిమితం లేకపోవడంతో విశాఖ వచ్చేశాడు. మద్దిలపాలెంలో అనుమానాస్పదంగా తిరుగుతున్న ఆయనను స్థానికులు గుర్తించి 3వ పట్టణ పోలీసులకు సమాచారం అందించారు. దీంతో పోలీసులు అతన్ని అదుపులోకి తీసుకుని రెడ్‌క్రాస్ ప్రతినిధులు సహకారంతో చికిత్స నిమిత్తం చినవాల్తేర్‌లోని మానసిక ఆస్పత్రికి తరలించారు. కొంత కాలంగా చికిత్స పొందుతున్న ఆయన నుంచి వైద్యులు వివరాలు సేకరించి రెడ్ క్రాస్ హోమ్ లెస్ షెల్టర్ ప్రతినిధి మురళీకి తెలియజేశారు. పోలీసుల ద్వారా వారి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. అతని తండ్రి మేనా ప్రిబాకా, మేనమామ హుకాజయి విశాఖ చేరుకోగా ప్రియక నారిందును రెడ్ క్రాస్ ప్రతినిధుల అప్పగించారు. ఈ సందర్భంగా వారు ఆనందం వ్యక్తం చేసి, రెడ్ క్రాస్ ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు.